స్కెచ్

# చిలిపికయ్యం

"గోపి"

అత్తగారు ఊరికివెళ్ళి నెలరోజులైంది. ఆమె వెళ్ళినప్పుడు పూర్తి స్వతంత్రం వచ్చినట్లు సంతోషించింది. కాని ఈనెలా గడిచేసరికి కష్టం తెలిసొచ్చింది. జీతం వచ్చిన మొదటివారం భర్త ఆఫీసునుంచి రావడమే శకుంతల ప్రారంభించింది,

"ఏమండీ! ఇవాళ మనం సినీమాకి వెళతామట కదండీ?" అంటూ చేతిలో దువ్వుతూన్న జుత్తు పిడికిలిపట్టి, నోట్లోంచి పన్నెతీస్తూ వెనక్కి తిరక్కుండానే గుణిసింది.

వెంకటేశ్వరులు తాలూకాఫీసు క్లార్కుకి చిహ్నం ఐన "పీచుకోటు"ని ఇంకా ఇప్పనేలేదు. వస్తూన్నప్పుడు "దేశోద్ధారక", సిరస్తాదారు తాలూకాఫీసు నీతుల్ని, కొత్తగా కాలేజీలనుంచి దిగబడ్డ "పట్టభద్రుల"తల్లో నాటుకునేట్టు, అన్యాపదేశంగా పెట్టిన చీవాట్లు, ఇంకాచెవుల్లోగింగురుమంటూనే ఉన్నాయి. లెక్చరర్లని కప్పగంతులు వేయిస్తూ, గేలరీలని అనర్గళంగా ఒకమోత మోగించిన వెంకటేశ్వర్లు "బోసిపులి" పెట్టిన చీవాట్లు ఘనరుకి తట్టుకోలేక, చేసేదిలేక కారాలునూరుతూ వచ్చాడు... అది శకుంతల కనిపెట్టలేదు!

"సినీమాలేదు గినీమాలేదు. ఏం వేషంలావుంది. డబ్బేం తేరగా రాలేదు, చీటికీ మాటికీ సినిమా అంటే!" అన్నాడు చీదరించుకుని.

శకుంతల మనస్సు చివుక్కుమంది. ఇంతకు ముందు అలవాటులేని పనుల్లో చీవాట్లు తింటూ, నెలల్లా నరకకూపంలోలా గడిపి, ఇవాళకి నోరు విడచి 'సినీమా కెళదాం' అంటే అంత కసురుకోవాలా? అన్న తామసం కలిగింది...'ఇంతకీ పాతనెలలో తనని తీసుకువెళ్ళకుండా వెళ్ళిన రెండు సినీమాలూ జ్ఞాపకం లేనట్టున్నారు కామోసని' గాంద్రించింది మనస్సులో.

"ఎప్పుడు వెళ్ళేమండీ! ఆ మాటకొస్తే ఊళ్ళో అందరిలాగా వెళితే ఇంకా అని పోదురు కామోసు వరాలమ్మ, బుల్లెమ్మ రాధమ్మల్లా వెళితే మరీనీ ఒకసారి వెళితే ఏంమాతుందేంటి?...మన సిగరెట్ల ఖర్చులో ఎన్నోవంతో!" అనేసింది తొందరపాటుగా. కొసమాట అనకపోతే, కేసు చాలా మట్టుకు నెగ్గేదే శకుంతల. "సిగరెట్ల ఖర్చు" అనడంతోనే తోకతొక్కిన పాములా 'చర్రు'మని లేచాడు వెంకటేశ్వరులు. అసలు విషయం మరిచి అడ్డుతోవని పడ్డాడు.

"బుల్లెమ్మ ముగుణ్ణొదిలేసింది-నువ్వూ వదిలేస్తావా? అమెతో సాపత్యం ఏమిటి? నా సిగరెట్లకి మీ నాన్నగారిదగ్గర్నుంచి చేసున్నా తెచ్చి పెడుతున్నావా?" అన్నాడు ఘాటుగా.

స్త్రీని ఏ రెండూ అంటే కోపం వస్తుందో ఆ రెండింటినీ ఎదిరించాడు మన పీచుకోటు నాయకుడు. వ్యవహారం కొంచం ముదిరింది. పెద్దింటి పిల్ల. పుట్టిల్లంటే అభిమానం.

"చాల్లెండి! మావాళ్లని ఎంచొచ్చారు ఇచ్చిందీ పుచ్చుకున్నదీ చాల్లేదు కామోసు? మనం శామలం అన్నయ్యకి రాజ్యానికీ ఏమిచ్చేస్తున్నామో?... పండుక్కి పిలిచి ఒక సూటుగుడ్డ ఇవ్వలేకపోయాం, తండ్రిలేని పిల్లనేన్నా ముద్దు ముచ్చట చేయలేకపోయాం, నువుంకూడా బడాయి కొట్టడమే!" అని అడబ్బొట్టైని వెనకేసుకు ఎదిరించింది. మాట వస్తే ఊరుకుంటుందా ఎంత పెళ్ళాం ఐనా?

"మేం ఏమిచ్చామో ఏం చేసేమో నీకేం తెలుసు? మొన్నగాక నిన్న కళ్లు తెరిచావు. మీ మేనత్తనడుగు శ్యామలం చదువూ సంధ్యా ఎవరు చూచారో! అన్నీ తెలుస్తాయి" అన్నాడు వెంకటేశ్వర్లు.

"ఇంట్లో బసిచ్చి, ఎప్పుడో ఒకనెల జీతంకట్టి ఇంట్లో అపనీ ఈపనీ చేయించుకుంటూ, అందరితోపాటు బట్టలుపెట్టి గొప్ప చెప్పుకోడం, నిజంగా మా నాన్నకిగారిచాత రాదండీ, మీరు కాబట్టి..."

ఇంకా మాట పూర్తికాకుండానే గద్దించాడు.

"నోర్మూయ్, ఒళ్లెరక్కుండా వాగుతున్నావు, మీనాన్నగారేదో వియ్యమ్మణగా పెట్టేరనుకుంటున్నావా ఏం?..." అని భర్త హోదాలో అధికారాన్ని చూపించాడు.

...శకుంతల "వాళ్ళ నాన్నగారు కట్నాలూ లాంఛనాలు ఎక్కువగా యిచ్చారని" చెప్పడం ఇది మొదటిసారి కాదు. వెంకటేశ్వర్లు కాలేజీలో నిర్మించుకున్న ఆదర్శాలు సమూలంగా కూలిపోయేట్టు పెళ్ళికి కట్నం కానుక పుచ్చుకోక తప్పలేదనే కించతో ఏమన్నా ఊరుకునేవాడు. కాని ఇవాళ ఎదిరించకుండా ఉండలేక పోయాడు...

"అనుకోడం ఏముంది? అందరికీ తెలిసిందే" అంది ఉక్రోషంగా.

"ఇచ్చేరు, ఇచ్చేరు. ఏమిచ్చారో చెప్పు? ఒకటి బొక్కి సైకిలు, రెండు తిరగని వాచీ, మూడూ సిరాకక్కే పెన్, నాలుగు లక్కముంత లాంటి వెండిచెంబు... ఇంతేనా? అదిగోసివెంత బడాయి కొట్టినా ఇచ్చారా కట్నం డబ్బు. పెళ్ళిసంతలో చలామణీ కావాలంటే ఆమాత్రం కూడా ఇవ్వకుండా ఎలాగౌతుందిలే, నీలాంటి అపూర్వసుందరి పెళ్ళి అయిందనిపించేందికి. అందుకే చెయ్యిచాపిన అభాగ్యుణ్ణి నేను... మొన్న పెళ్ళయింది. మా ఆఫీసులోనే పనిచేస్తున్నాడు, అవీ వేడుకలూ, కట్నాలూ, లాంఛనాలూ అంటే." అన్నాడు తృప్తిగా తన వ్యక్తిత్వం పూర్తిచేసి.

సమరపథం తొక్కింది శకుంతల. కళ్ళెర్ర పడ్డాయి. ముఖం జేవురించుకుంది. "ఆ! ఆ! చాల్లెండి. ఆపిల్లకి పెట్టిన బంగారం చూస్తే మీరూ గుండె కొట్టుకుంటారు. మీరేం పెట్టారో తెలుసునుగా! ముచ్చటకి తూచి తులం బంగారం, పసుపుపెట్టి ఒక పట్టుచీర, ఆనాటి నించి ఈ నాటికి ఈ మొహం నోచుకోలేదు, నాదీ ఓ బ్రతుకే! రెండు పూటలు తిండి, అదేకదూ మన ముద్దూ ముచ్చటా అంతాను" అని సతాయించింది.

వెంకటేశ్వర్లు క్రాస్‌వర్డ్ మెంటాలిటీలో పడ్డాడు, "ఆడదానికి అదృష్టంవుంటే అన్నీ వస్తాయి" అన్నాడు ఘాసాయింపుగా.

"ఆడదాని అదృష్టం బాగానే ఉంది. ఆ అదృష్టం ఏదో మొగాళ్ళకుంటేసరి. మేం ఉద్యోగము చెయ్యాలా? ఊళ్ళేలా? అదృష్టం ఉంటేనేమిటి? లేకుంటేమిటి? మీతోపాటు చదువుకున్న వాళ్లెంతమంది తాసిల్దార్లు కాలేదు. రోలి మీద కోపం ఆలిమీదన్నట్లు, చాతకాకపోతే, 'అదృష్టాలు' వస్తాయి" అని సాగదీసింది.

* * *

ఇద్దరూ కూడా వెంటనే చూపుల్ని లోపలికి తిప్పుకున్నారు. పెండ్లిచూపులకి పోయినప్పుడు సూదిపోటులాంటి క్రీగంటి చూపు, మొదటిరాత్రి కలయికలో మునిగితేలిన సౌఖ్యం, వచ్చే డబ్బులోనే పొదుపుచేసే శకుంతల లౌక్యం, వెంకటేశ్వర్లుని కృంగదీశాయి "తప్పుచేశావ్" అని. డబ్బు లేకపోయినా, ఉన్నదాంట్లో నెలనెలా తనకోసం తెచ్చే పువ్వులు, కాయలు, ఎంత విసుగుగా ఉన్నా చెప్పే చక్కని కబుర్లు, ఏవి తలుచుకున్నా శకుంతల వెంకటేశ్వర్లులో దోషం కనబడలేదు. పెండ్లి నెలరోజులు పొడిగించమంటే, కట్నం ఆశచే అలా చేగారేమో అని వందా పదీ పోయినా వెళ్ళి వెంటనే కావాలని తండ్రి పడ్డ తొందర, పెళ్ళిముందు, పెళ్ళి తరువాత తన ప్రవర్తన తలుచుకు కించపడింది. 'ఎల్లకాలం సాగాల్సిన సంసారం ఇంత చిన్నవిషయంలో కొరత పెట్టుకుంటే ఎల్లాగని' చీరకొంగు తీసుకు తుడుచుకో ప్రారంభించింది.

"లే,శకూ రెండో ఆటకి పోదాంలే" అన్నాడు.

"పోన్లెస్తురూ సినీమా లేకపోతే బ్రతుకే లేదా? పొద్దున్ననగా తిన్న తిండి, కాఫీ కూడా త్రాగలేదు. లెండి భోజనం చేదురుగాని," అని అప్యాయంగా పిలిచింది. భోజనంచేస్తూ ఆఫీసులో జరిగిన గొడవ చెప్పుకున్నాడు వెంకటేశ్వర్లు.

"అలా చెప్పండీ! ఎవరి ముఖం చూచామో ఇవాళ, లేకపోతే ఎందుకౌతుందిలా" అని ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణకి ఎరగని "మొహంమ్మీద పారేసింది" దిగదుడిచి!

"తొందరగా తిను రెండో ఆటకి పోదాం" అన్నాడు వెంకటేశ్వర్లు.

"అబ్బే, కావస్తే శనివారం పోదాం, జబ్బు చేస్తుంది రెండో ఆట" అని వాదించుకు, రెండు పిట్టలూ గూడు చేరాయి యథాప్రకారంగా! ★